డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే బంగారు భవిష్యత్

❖ పునర్జన్మ రిహాబిలిటేషన్ సెంటర్‌లో షీ టీమ్ అవగాహన సదస్సు



దశ, వనస్థలిపురం: మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత జీవితాన్నే కాకుండా కుటుంబ వ్యవస్థను, ముఖ్యంగా మహిళలు మరియు పిల్లల భద్రతను తీవ్రంగా ప్రభావితం చేస్తుందని వనస్థలిపురం షీ టీమ్ ఇన్‌ఛార్జ్, సబ్ ఇన్‌స్పెక్టర్ పి. శ్రీనివాస్ పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయి, మద్యపానం వంటి వ్యసనాలకు బానిసలైన వారు ఆత్మవిశ్వాసంతో వాటిని అధిగమించి సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వనస్థలిపురం షీ టీమ్ ఆధ్వర్యంలో పునర్జన్మ రిహాబిలిటేషన్ సెంటర్‌లో డ్రగ్స్, గంజాయి, మద్యపాన వ్యసనపరుల కోసం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ శ్రీమతి బి. సుమతి, ఐపీఎస్, ఉమెన్ సేఫ్టీ విభాగం డీసీపీ శ్రీమతి టి. ఉషారాణి ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ సందర్భంగా షీ టీమ్ ఇన్‌ఛార్జ్ ఎస్ఐ పి. శ్రీనివాస్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడటం వల్ల ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితులు, కుటుంబ సంబంధాలు దెబ్బతినడంతో పాటు వ్యక్తి భవిష్యత్తు కూడా ప్రమాదంలో పడుతుందని వివరించారు. వ్యసనానికి బానిసైన వ్యక్తి ప్రభావం కుటుంబ సభ్యులపై కూడా తీవ్రంగా ఉంటుందని, ముఖ్యంగా మహిళలు మానసికంగా, శారీరకంగా మరియు సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండటమే కాకుండా, ఇప్పటికే వ్యసనానికి గురైన వారు చికిత్స, కౌన్సెలింగ్ ద్వారా పూర్తిగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని సూచించారు.

వ్యసనం ఒక సమస్య అయినప్పటికీ దాని నుంచి బయటపడేందుకు సరైన చికిత్స, కుటుంబ సభ్యుల సహకారం, ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని అధికారులు తెలిపారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు మత్తు పదార్థాలను పరిష్కారంగా భావించకుండా, ధైర్యంగా ఎదుర్కొని ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. అత్యవసర సమయంలో పోలీసులను సంప్రదించాలి.

మహిళలు, యువతులు లేదా ఇతరులు ఏదైనా ప్రమాదం, వేధింపులు, హింస లేదా అత్యవసర పరిస్థితిని ఎదుర్కొన్నప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని షీ టీమ్ సిబ్బంది సూచించారు. అత్యవసర సమయాల్లో డయల్ 100 లేదా 112కు ఫోన్ చేసి తక్షణ పోలీసు సహాయం పొందవచ్చని తెలిపారు. అలాగే మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ అధికారిక వాట్సాప్ నంబర్ 8712662111ను సంప్రదించి సమస్యను తెలియజేయవచ్చని సూచించారు.

సమాజంలో మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు, కుటుంబ సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు మరియు ప్రజలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పునర్జన్మ రిహాబిలిటేషన్ సెంటర్ ప్రతినిధులు రవి చౌదరి, వేణుగోపాల్ రెడ్డి, జోసఫ్, వనస్థలిపురం షీ టీమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్ అభ్యర్థులకు అదనపు అవకాశం



దశ, రంగారెడ్డి: అంగన్వాడీ టీచర్ల నియామక ప్రక్రియలో భాగంగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరై, అవసరమైన పత్రాలు సమర్పించని అభ్యర్థులకు అదనపు అవకాశం కల్పించారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఇతర అవసరమైన పత్రాలను అక్టోబర్ 9 సాయంత్రం 5 గంటల్లోగా సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల్లో సమర్పించాలి. ఈ అవకాశాన్ని చివరి అవకాశంగా భావించి, నిర్ణీత గడువులోగా పత్రాలు సమర్పించాలని జిల్లా సంక్షేమ అధికారి సూచించారు.

గ్యాస్ లీక్ అయి పూరి గుడిసె దగ్ధం



దశ, మునగాల: వంటగ్యాస్‌లీకై మంటలు వ్యాపించి పూరిగుడిసె దగ్ధమైన సంఘటన బుధవారం మండల పరిధిలోని కలకోవ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కలకోవ గ్రామంలోని ఎస్సీ కాలనీలో నిరుపేద కుటుంబానికి చెందిన చిర్రా గురవయ్య ఎన్నో ఏళ్లుగా పూరి గుడిసెలో నివాసంఉంటున్నాడు, బుధవారం గురవయ్యనివాసంలో వంటగ్యాస్ లీకై మంటలు వ్యాపించి క్షణాలలో ఆ మంటలు కాస్త తీవ్రం కావడంతో గుడిసెకు అంటుకొని గుడిసె మొత్తం తగలబడిపోయింది. ఇట్టి సంఘటనలో గురవయ్య తాటాకుల పూరిగుడిసె పూర్తిగా దగ్ధం కాగా, తన నివాసంలోని నిత్యవసర వస్తువులు బియ్యం బట్టలు, విద్యుత్ సామాగ్రి బీరువా ఇతర విలువైన వస్తువులు కాలిబూడిదయ్యాయి. ఇంతలో చుట్టుపక్కల వారు చూసి, అగ్నికి ఆహుతి అవుతున్న పూరిగుడిసెను నీళ్లు చల్లి మంటలను ఆర్పి ప్రయత్నం చేసినప్పటికీ నిమిషాలలో పూరిగుడిసె పూర్తిస్థాయిలో దగ్ధమైంది, ఈ ఘటనతో గురవయ్య కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో రోడ్డున పడాల్సి వచ్చింది. నిరుపేద దళిత కుటుంబానికి చెందిన చిర్రా గురవయ్య కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

NCC తెలంగాణ అధ్యక్షుడిగా బిషప్ మద్దెల సంజయ్ ఆనంద్

❖ మరో రెండేళ్లు పదవీకాలం పొడిగింపు



దశ ఓయూ: నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ (NCC) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా బిషప్ మద్దెల సంజయ్ ఆనంద్ మరో రెండేళ్లపాటు పునర్నియమితులయ్యారు. ఆయనకు పునర్నియామక ఉత్తర్వులను NCC వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.టి. రెవ. డాక్టర్ కె. సామ్ పాల్, రెవ. స్టీఫెన్ చిట్టిబాబు, రెవ. బ్రైటీ బ్యూలా అందజేశారు. గత ఐదేళ్లుగా NCCతో కలిసి పనిచేస్తున్న సంజయ్ ఆనంద్ తెలంగాణలో సంస్థాగత విస్తరణ, నాయకత్వ బలోపేతం, జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటు, క్రైస్తవ సమాజ సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు కృషి చేశారు. విద్య, ఉపాధి, సామాజిక న్యాయం, హక్కులు, అభివృద్ధి అంశాలపై పలు కార్యక్రమాలు చేపట్టారు. తన పునర్నియామకానికి జాతీయ నాయకత్వానికి, రాష్ట్ర కమిటీకి, NCC కుటుంబ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రెండేళ్లలో 'క్రైస్తవ హక్కులు-సమాజ అభివృద్ధి-NCC బలోపేతం' లక్ష్యంతో సేవా, అవగాహన, సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని పేర్కొన్నారు.



ఉదయ్ కిరణ్ జయంతి సందర్భంగా సేవా కార్యక్రమం

❖ వికలాంగులు, చిన్నారులు, వారి తల్లులకు ఆహారం, దుప్పట్ల పంపిణీ



దశ, పెద్ద అంబర్‌పేట: పెద్ద అంబర్‌పేట పరిధిలోని తట్టి అన్నారంలో వెన్నెల డిఅడిక్షన్ సెంటర్ సంస్థాపకుడు ఉదయ్ కిరణ్ జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగులు, చిన్నారులు, వారి తల్లులకు ఆహారం అందించడంతో పాటు దుప్పట్లను పంపిణీ చేశారు. సమాజంలోని పేదలు, నిరుపేదలు, అవసరంలో ఉన్న వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. జయంతి వేడుకలను కేవలం కార్యక్రమాలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం ద్వారా మానవతా విలువలను చాటారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. సమాజంలో ఆర్థికంగా వెనుకబడినవారికి, వికలాంగులకు, చిన్నారులకు ప్రతి ఒక్కరూ తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. భవిష్యత్తులో కూడా అవసరమైన వారికి అండగా నిలిచేలా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఉదయ్ కిరణ్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ సేవా కార్యక్రమం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.

కాటారంలో ఘనంగా సేవా జ్యోతి సంకల్ప సభ



దశ, కాటారం: ప్రధాని నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కాటారంలో బీజేపీ ఆధ్వర్యంలో సేవా జ్యోతి సంకల్ప సభ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చల్ల నారాయణ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాటారం సబ్‌డివిజన్‌లోని ఐదు మండలాలకు చెందిన నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎల్‌సీడీ స్క్రీన్‌ల ద్వారా ప్రధాని మోడీ ప్రసంగాన్ని వీక్షించిన అనంతరం చల్ల నారాయణ రెడ్డి సేవా జ్యోతి వెలిగించి బైక్ ర్యాలీని ప్రారంభించారు. సుమారు 150 బైక్‌లతో కాటారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన మహిళలు, సీనియర్ నాయకులను బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా చల్ల నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాసేవకు అంకితమైన మోడీ 25 ఏళ్ల ప్రస్థానం కార్యకర్తలకు స్ఫూర్తిదాయకమన్నారు. 'సబ్‌కా సాథ్.. సబ్‌కా విశ్వాస్' లక్ష్యంతో 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణం కోసం మోడీ పనిచేస్తున్నారని తెలిపారు. తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు అవకాశం ఇస్తారనే నమ్మకం ఉందన్నారు. మంథని నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరేయడమే లక్ష్యంగా కార్యకర్తలు ప్రజా సమస్యలపై పోరాటాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు అండగా నిలవడం నాయకుల బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పాగే రంజిత్ కుమార్, మేడిపల్లి పూర్ణచందర్, బండ శ్రీకాంత్ పటేల్, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎండీ రఫీ, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం తిరుపతి, మహిళా నాయకురాళ్లు బిసుల నిర్మల, లక్ష్మి, జిల్లా, మండల నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటు చోరీ కీలక సూత్రధారి జ్ఞానేష్ కుమార్ దిగిపోవాలి



❖ డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బుర్ర అనిల్ కుమార్
❖ రామన్నపేటలో డివైఎఫ్ఐ నిరసన కార్యక్రమం
❖ డివైఎఫ్ఐ నాయకులతోపోలీస్ వాగ్వాదం

దశ, రామన్నపేట: డివైఎఫ్ఐ రామన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్వర్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది.

ఈ సందర్భంగా డివైఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర అనిల్ కుమార్ మాట్లాడుతూ దేశంలోని సంచలనంగా మారిన ఓట్ చోరీ అనే అంశం మీద దేశమే అట్టుడికి పోతున్న సందర్భంలో వివిధ రూపాలలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము ప్రధాన ఎన్నికల కమిషన్ సిఈసి జ్ఞానేష్ కుమార్ ఒంటెద్దు పోకడతోటి దేశంలోనే మూడున్నర కోట్ల ఓట్లను చోరీ చేసి ప్రజాస్వామ్యాన్ని అపహేళన చేసే విధంగా చేసిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది జ్ఞానేష్ కుమార్ మాత్రమే దేశంలో గాని రాష్ట్రంలో గాని పొట్ట తిప్పల కోసం చిన్న చిన్న దొంగతనాలు చేసినటువంటి సామాన్య ప్రజలను తీవ్ర స్థాయిలో ఇబ్బందుల గురి చేసి జైలులో నిర్బంధిస్తున్న తరుణంలో మరి జ్ఞానేశ్వర్ బయట ఎందుకు ఉండాలో కేంద్ర ప్రభుత్వం కూడా సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది అని అన్నారు ఓట్ చోరీ చేసి ప్రశాంతంగా రూములలో సేదా తీరుతున్న జ్ఞానేశ్ కుమార్ ను తక్షణమే బర్తరఫ్ చేసి జైల్లో పెట్టాలని డివైఎఫ్ఐ గా డిమాండ్ చేస్తున్నాము ఇది కేవలం కేంద్ర ప్రభుత్వ యొక్క అందదండలతోటి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు అదేవిధంగా బెంగాల్ రాష్ట్రంలో 90 లక్షల ఓట్లను తీసేసి నకిలి ప్రభుత్వం ఏర్పాటు అయింది అని కూడా అన్నారు నకిలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అన్ని విధాలుగా సహకరించిన జ్ఞానేష్ కుమార్ ని తక్షణమే భర్తరఫ్ చేసే వరకు మా పోరాటాలు ఉధృతంగా ఉంటాయని కేంద్ర ప్రభుత్వాన్ని జ్ఞానేశ్ కుమార్ ను హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రామన్నపేట మండల అధ్యక్ష కార్యదర్శులు మెట్టు శ్రవణ్ కుమార్ శానకొండ రామచంద్రం మండల కమిటీ సభ్యులు మునికుంట్ల లెనిన్, నాగటి రవి, జేల్లాల మల్లేశం, ఆవనగంటి మహేష్, గట్టు మహేష్,మచ్చ నరేష్, తదితరులు ఈ కార్యక్రమం పాల్గొన్నారు.

ఈవీఎం గోదాము వద్ద పటిష్ట భద్రత



దశ, ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు) భద్రపరిచిన గోదాము వద్ద పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదామును కలెక్టర్ తనిఖీ చేశారు. గోదాము సీల్స్, భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, పర్యవేక్షణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గోదాము పరిసరాలను 24 గంటల పాటు సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నామని, భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని పేర్కొన్నారు.

జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

యువజన కాంగ్రెస్ రామన్నపేట

దశ, రామన్నపేట: భారత ప్రధాన ఎన్నికల కమీషనర్ జ్ఞానేష్ కుమార్ అవలంబిస్తున్న ధోరణిని నిరసిస్తూ రామన్నపేట మండల యువజన కాంగ్రెస్, ఆధ్వర్యంలో రామన్నపేట మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్లో యువజన కాంగ్రెస్ శ్రేణులు భారీ నిరసన చేపట్టి, జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు, ఈ సందర్భంగా రామన్నపేట యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బట్టె సంతోష్ కుమార్ మాట్లాడుతూ ,తక్షణమే జ్ఞానేష్ కుమార్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ బీజేపీ, ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో నడుస్తూ దేశంలో దాదాపు 14 కోట్ల ఓట్లను ఎలాంటి అభ్యంతరాలు లేకుండా తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు,ఈసీ అక్రమ తీరును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, నేతృత్వంలోకాంగ్రెస్ పార్టీదేశవ్యాప్తంగా అనేక పోరాటాలు నిర్వహిస్తున్నారని అన్నారు,జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్ భాను చిబ్,అదేశాల మేరకు జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రామన్నపేట యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు, చేపట్టుతున్నామని అన్నారు,తక్షణమే కేంద్రప్రభుత్వం స్పందించి ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను అరెస్ట్ చేయాలని లేనిచో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు, నకిరేకల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పున్న అమరేందర్, మండల ఉపాధ్యక్షులు కేస సాయి, పట్టణ అధ్యక్షులు జవ్వాజి శ్రీకాంత్, కొమ్మగూడెం గ్రామ శాఖ అధ్యక్షులు వీరమల్ల పరుశురాం, ఇస్కిల్లా గ్రామ శాఖ అధ్యక్షులు బండెల వినయ్, పట్టణ కార్యదర్శి కామిటికారి సాయి వెంకట్, సుర్వి మచ్చ గిరి, సుర్వి రాకేష్, పాషా, సింగరాయబోయిన అభిలాష్,తదితరులు పాల్గొన్నారు.

బతకలేక బడిపంతులు కొలువు

- టీచర్ కన్నా పంబ్లర్ జీతమే ఎక్కువ
- అడ్డ మీద కూలీకి రోజుకు: 1200
- పార్ట్ టైం టీచర్కి రోజుకు 600 - 800
- రెండు గంటల ఉపాధి హామీకి 300
- 24 గంటల టీచర్ పనికి 600
- ఎక్కడా దిక్కు లేక ఈ ఉద్యోగం



దశ, తాండూర్ ప్రతినిధి: బడిపంతులు కొలువు అనేది ఇప్పుడు బతకలేక, ఎక్కడ ఏ ఆధారం లేక, గత్యంతరం లేక చేస్తున్నట్టుగా ఉంది. ఎక్కడ బతుకుదెరువు లేక ఈ బడిపంతులు కొలువు చేస్తున్నట్టుగా ఉంది కొందరి జీవితాలు. ఎందుకంటే సరైన జీతాలు ఉండవు. సమయానికి రావు, సంవత్సరం పొద్దు జీతాలు అసలే ఇవ్వరు. పేరుకే టీచర్లు.. వీళ్ళ కన్నా బిచ్చగాడు నయం. ఎలాంటి టెన్షన్లు లేకుండా తన పని తాను చేసుకుంటాడు. కానీ ఉపాధ్యాయుడు మాత్రం ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకున్నంత వరకు టెన్షన్ పడుతూనే ఉంటాడు. అందులో ఈ గురుకులాలలో అయితే మరింత టెన్షన్ ఉంటుంది. 24 గంటలు విద్యార్థుల గురించి ఆలోచించాలి. కనీసం తల్లిదండ్రులు కూడా వాళ్ళ పిల్లల గురించి అంతగా ఆలోచిస్తారో లేదో తెలియదు కానీ ఉపాధ్యాయులు మాత్రం తప్పనిసరిగా వాళ్లకు కేటాయించిన విద్యార్థులను గురించి మాత్రం ఆలోచించాల్సిందే. సొంత పిల్లలు ఏమైపోయినా పర్వాలేదు.కానీగురుకులపాఠశాలలో ఉండేపిల్లలనుమాత్రంమంచిగాచూసుకునేబాధ్యత ఉపాధ్యాయుడిదే. పని ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. జీతం మాత్రం తక్కువగా ఉంటుంది. అసలు గురుకుల లో పనిచేసే టీచర్లు వీళ్లు బోధించడానికి వచ్చారా వాచ్మెన్ ఉద్యోగం చేయడానికి వచ్చారా అర్థంకాని పరిస్థితి నెలకొంది.

24 గంటల పని ఒత్తిడి..

గురుకుల పాఠశాలల్లో ఉదయం నుంచి రాత్రి దాక అన్నీ తామై విధులు నిర్వర్తిస్తున్నారు. ఉదయం ఏడు గంటల 30 నిమిషాలకు పాఠశాలకు హాజరై, ఉదయం బ్రేక్ ఫాస్ట్, ప్రార్థన, సబ్జెక్టుల వారీగా తరగతులు, లంచ్ డ్యూటీ, సూపర్ విజన్ స్టడీ, నైట్ స్టడీ, నైట్ స్టే, హాలిడే డ్యూటీ, విద్యార్థుల అటెండెన్స్ ఫేస్ రికార్డ్, ఇతర చెత్త పనులు అని ఇలా రాత్రి వరకు విధులు నిర్వహిస్తున్నారు. కానీ జీతాలు అతి తక్కువగా ఇస్తున్నారని పార్ట్ టైం ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో ఇచ్చే జీతాలు చాలక, కుటుంబాలు గడవక అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా పనిచేస్తూ, వెట్టిచాకిరి, బానిస బతుకుల మధ్య ఉపాధి కొనసాగిస్తున్నామని పార్ట్ టైం ఉపాధ్యాయులు తమ గోడును వెళ్లబోసుకుంటున్నారు. పార్ట్ టైం ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత లేక భవితవ్యం అగమ్యగోచరమైందని, తమ గోడును ప్రభుత్వం పట్టించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గురుకులాల సెక్రెటరీ స్పందించి తమ జీతాలు పెంచాల్సిందిగా కోరుతున్నారు.

12 నెలల మొత్తం వేతనం చెల్లించాలి..



గురుకుల పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు బోధన, బోధనేతల సిబ్బందికి ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారిని తప్పనిసరిగా ప్రభుత్వం రెగ్యులరైజేషన్ చేయాలని కోరుకుంటున్నాం. అదేవిధంగా పీఆర్సీ అన్ని పాఠశాలలకు ఉపాధ్యాయులకు ఇతర ఉద్యోగులకు వర్తించినప్పుడు.. పార్ట్ టైం ఉపాధ్యాయులకు కూడా వర్తింపజేయాలి. రెగ్యులర్ ఉపాధ్యాయులకు చెల్లించే వేతనాన్ని కూడా పార్ట్ టైం ఉపాధ్యాయులకు కనీసం సగం అయిన చెల్లించాలి. సమాన పనికి సమాన వేతనం అని సుప్రీంకోర్టు ఎప్పుడో తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును ప్రభుత్వాలు అమలు చేయాలి. ఒకే ఉద్యోగంలో, ఒకే కేడర్ల ఉన్నా కానీ.. జీతాలలో చాలా వ్యత్యాసం ఉంది. ఇలాంటి దుస్థితిని తొలగించాలి. పార్ట్ టైం మహిళా ఉపాధ్యాయులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలి. కొందరు టీచర్లకు యూనిక్ ఐడి రాలేదు. అలా రాకుంటే జీతాలు రావు. మరో 30 రోజుల్లో ఆ టీచర్లకు యూనిక్ ఐడి రాకపోతే ప్రభుత్వం పైన తిరుగుబాటు చేస్తాం.

- మహేష్,
వికారాబాద్ జిల్లా గురుకులాల అధ్యక్షుడు

పోట్ట కూటి కోసమే ఈ ఉద్యోగం



పార్ట్ టైం టీచర్ ఉద్యోగం కన్నా అడ్డ మీద కూలికే జీతం ఎక్కువగా ఇస్తున్నారు. అదేవిధంగా చాయ్ అమ్మినోడికే జీతం ఎక్కువగా ఉంది. రెస్టారెంట్లో ప్లేట్లు కడిగిన వాడికి గౌరవం, మర్యాదలు ఉన్నాయి. కానీ పార్ట్ టైం టీచర్లకు మాత్రం ఎలాంటి గౌరవం, మర్యాదలు ప్రభుత్వం ఇవ్వడం లేదు. ఒకవైపు ప్రభుత్వాల నుంచి పని ఒత్తిడి, మరొకవైపు తల్లిదండ్రుల నుంచి ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. ఈ రెండింటి మధ్యలో తన కుటుంబాన్ని ఉపాధ్యాయుడు మర్చిపోతున్నాడు. తన కుటుంబం ఏమైనా పర్వాలేదు కానీ గురుకులలో చదువుకునే పిల్లలు మాత్రమే బాగుండాలని ప్రభుత్వాలు కోరుకుంటున్నాయి. మాకు 12 నెలలకు వేతనం చెల్లించాలి. ప్రతినెల 1వ తారీఖున వేతనం రావాలి. మళ్లీ మళ్లీ డెమోలు పెట్టకుండా ఆటో రెన్యువల్ చేయాలి. అకడమిక్ ఇయర్ మధ్యలో తీసివేయరాదు.

-రమేష్, కొడంగల్ మండల అధ్యక్షుడు

రైతుల సహకారంతో పారదర్శకంగా పూర్తి చేయాలి: కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

- ఇమ్మామ్‌గూడలో రీ-సర్వే పనుల పరిశీలన



దశ, రంగారెడ్డి: మహేశ్వరం మండలం ఇమ్మామ్‌గూడ గ్రామంలో కొనసాగుతున్న రీసర్వే ప్రక్రియను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రా రెడ్డి, ADSLR, మహేశ్వరం తహసీల్దార్, మండల సర్వేయర్, లైసెన్స్‌డ్ సర్వేయర్లతో కలిసి రీసర్వే పనుల పురోగతిని సమీక్షించారు. రీసర్వేలో భాగంగా చేపడుతున్న భూముల కొలతలు, హద్దుల నిర్ధారణ, రికార్డుల పరిశీలన తదితర ప్రక్రియలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. పనులు నిబంధనల ప్రకారం పకడ్బందీగా, శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామంలోని రైతులతో కలెక్టర్, అదనపు కలెక్టర్ నేరుగా మాట్లాడి రీసర్వేపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

భూముల హద్దులు స్పష్టత చెందడంతో పాటు భవిష్యత్తులో భూ సంబంధిత వివాదాలు, సమస్యలు తగ్గేందుకు రీసర్వే దోహదపడుతుందని అధికారులు వివరించారు. భూ రికార్డుల విషయంలో రైతులకు మరింత స్పష్టత లభిస్తుందని తెలిపారు. రీసర్వే ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేందుకు రైతుల సహకారం ఎంతో కీలకమని అధికారులు పేర్కొన్నారు. సర్వేయర్లు క్షేత్రస్థాయికి వచ్చినప్పుడు రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలు, హద్దులు తదితర సమాచారాన్ని అందించి పూర్తి సహకారం అందించాలని కోరారు. రైతుల భాగస్వామ్యంతో రీసర్వేను పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సర్వే సందర్భంగా రైతులకు తలెత్తే సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేస్తూ, వారి భాగస్వామ్యంతో ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

లాలాగూడలో మహిళ అదృశ్యం




దశ, ఓయూ: లాలాగూడ శాంతినగర్‌లోని రామాలయం సమీపంలో కేతం మల్లేశ్వరి (38) అనే మహిళ అదృశ్యమయ్యారు. ఈ నెల 3న సాయంత్రం 5 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదని కుటుంబసభ్యులు తెలిపారు. గతంలోనూ ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయిన సందర్భాలు ఉన్నాయని పేర్కొన్నారు. మల్లేశ్వరి ఎత్తు సుమారు 5 అడుగులు, తెల్లటి ఛాయతో ఉంటారు. అదృశ్యమైన సమయంలో పసుపు రంగు చీర, బ్లౌజ్ ధరించి ఉన్నారు. కుడి చెంపపై మచ్చ గుర్తుగా ఉంది. తెలుగు మాట్లాడుతారు. ఆమె ఆచూకీ తెలిసినవారు లల్లగూడ పోలీసులకు లేదా 9492352873 నంబర్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

లలితమ్మ దశదినకర్మకు మంత్రి జూపల్లి

- చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు
- కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్పు



దశ, చిన్నంబావి: చిన్నంబావి మండలంలోని గడ్డ బస్వాపురం గ్రామంలో బుధవారం జరిగిన ఉమ్మడి బెక్కెం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ లలితమ్మ దశదినకర్మకు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లలితమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. లలితమ్మ ప్రజలకు అందుబాటులో ఉంటూ మంచి పేరు సంపాదించుకున్నారని, ఆమె మృతి పార్టీకి, కుటుంబానికి తీరని లోటని అన్నారు. ప్రజాసేవలో ఆమె కుటుంబానికి ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు.లలితమ్మఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆమె కుమారుడు మందడి చిదంబర్‌రెడ్డికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా మాజీ మున్సిపల్ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీలు ప్రతాప్‌గౌడ్, రవినాయక్, సర్పంచ్ వడ్డేమాన్ బిచ్చన్నతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.



పల్లెలపై డిజిటల్ నజర్..!

- గ్రామాల సమగ్ర సమాచారం ఆన్ లైన్ లోనే
- జనాభా, మౌలిక వసతుల వరకు వివరాల నమోదు
- ప్రజలకు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం



దశ, తాండూర్ ప్రతినిధి: తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామాల వారీగా ప్రజలకు అవసరమైన సమాచారం సులభంగా లభించేలా డిజిటల్ రికార్డులను రూపొందిస్తోంది.ఇందులో గ్రామ జనాభా, కుటుంబాలు, నివాస గృహాలు, మౌలిక వసతులు తదితర వివరాలను నమోదు చేయనున్నారు. గ్రామ పంచాయతీల పరిధిలోని జనాభా వివరాలతో పాటు పురుషులు, మహిళలు, పిల్లలు, ఎస్సీ, ఎస్టీ తదితర వర్గాల వారీ సమాచారాన్ని కూడా పొందుపరచనున్నారు.అలాగే గ్రామంలో ఉన్న పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వైద్య సదుపాయాలు, తాగునీటి వనరులు, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల వివరాలను డిజిటల్ రికార్డుల్లో నమోదు చేయనున్నారు.

ప్రణాళికలకు మరింత ఉపయోగకరం

గ్రామాల అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు రూపొందించే సమయంలో ఈ సమాచారం కీలకంగా మారనుంది. గ్రామంలో ఏయే సదుపాయాలు ఉన్నాయి.. ఇంకా ఏయే అవసరాలు ఉన్నాయి అనే వివరాలు అధికారులకు స్పష్టంగా అందుబాటులోకి రానున్నాయి. దీంతో అభివృద్ధి పనుల ప్రాధాన్యతను నిర్ణయించడంలో ఈ డిజిటల్ సమాచారం ఉపయోగపడనుంది. ఇప్పటివరకు గ్రామాల వివరాల కోసం వివిధ కార్యాలయాలను సంప్రదించాల్సిన పరిస్థితి ఉండగా.. ఆన్‌లైన్ విధానం అందుబాటులోకి వస్తే ప్రజలకు కూడా సమయం ఆదా కానుంది. అవసరమైన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పరిశీలించడంతో పాటు డిజిటల్ రికార్డులను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించనున్నారు. గ్రామ పంచాయతీల సమాచారాన్ని ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పారదర్శకత పెరగడంతో పాటు పాలన మరింత సులభతరం కానుంది.

సైబర్ జాగృతి దివస్‌పై అవగాహన పోస్టర్లు

- ఆవిష్కరించిన డీసీపీ రాజా మహేంద్ర నాయక్



దశ, జనగామ: సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు నిర్వహిస్తున్న సైబర్ జాగృతి దివస్ కార్యక్రమంలో భాగంగా జనగామ డీసీపీ శ్రీ రాజా మహేంద్ర నాయక్, ఐపీఎస్, బుధవారం తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో రూపొందించిన సైబర్ అవేర్‌నెస్ పోస్టర్లను ఆవిష్కరించారు. రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్ లింకులు, అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని పోస్టర్ల ద్వారా తెలియజేస్తున్నారు. ఈ నెల సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమం ప్రధాన సందేశంగా “ఆగండి.. ఆలోచించండి.. అడుగు వేయండి”, “Pause. Think. Verify.” అనే నినాదాలను ప్రచారం చేస్తున్నారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకులు లేదా అనుమానాస్పద ఆఫర్లను వెంటనే నమ్మకుండా ముందుగా ఆగి ఆలోచించి, సంబంధిత సమాచారాన్ని ధృవీకరించిన తరువాత మాత్రమే తదుపరి చర్య తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రజలు సైబర్ మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా అవగాహన కల్పించాలని డీసీపీ రాజా మహేంద్ర నాయక్ సూచించారు.

అంతర్గత రోడ్ల పనులకు శ్రీకారం!



దశ, మణుగూరు: గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పినపాక ఎమ్మెల్యే లు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మణుగూరు మండలం సమితి సింగారం పరిధిలో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులను ముమ్మరంగా ప్రారంభించారు. సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉపసర్పంచ్ గాండ్ల సురేష్‌దగ్గరుండి ఈ పనులకు శ్రీకారం చుట్టారు.అంతర్గత రహదారుల నిర్మాణంలో భాగంగా 1వ వార్డు పరిధిలోని వాగు మల్లారంలో నూతన రోడ్ల నిర్మాణం చేపట్టడంతో పాటు, సైడు కాలువల్లో నీటి ప్రవాహానికి ఆటంకం కలగకుండా కొత్త సిమెంటు తూములను ఏర్పాటు చేసే పనులను వారు స్వయంగా పరిశీలించారు. నిర్మాణ పనుల్లో ఎక్కడా రాజీ పడకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తూ సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఉప్పల్‌లో జీవి మాల్‌ను ప్రారంభించిన సినీనటి భాగ్యశ్రీ బోర్సే





దశ, ఓయూ: నగరంలోని ఉప్పల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన జీవి మాల్‌ను సినీనటి భాగ్యశ్రీ బోర్సే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె నూతన వస్త్రాలను ధరించి ఫొటోలకు పోజులిచ్చారు. సినీనటి రాకతో మాల్ ప్రాంగణంలో సందడి నెలకొంది. ఆమెను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.